27-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు ఈ పతిత ప్రపంచం నుండి మీ బుద్ధియోగాన్ని తొలగించి అనంతమైన సన్యాసులుగా అవ్వాలి, సన్యాసులు అనగా పూర్తి పవిత్రమైనవారు మరియు పక్కా యోగులు"

ప్రశ్న:- ఏ అవస్థ రావడంతోనే మాయ తుఫానులు సమాప్తమవుతాయి?

జవాబు:- ఎప్పుడైతే నా పతి, నా పిల్లలు... అన్న ఈ నాది-నాది తో బుద్ధియోగం తెగిపోతుందో, నాకైతే ఒక్క శివబాబా తప్ప ఇంకెవరూ లేరు అన్నది బుద్ధిలో పక్కా అవుతుందో, ఒక్క తండ్రితోనే బుద్ధియోగం పూర్తిగా జోడించబడి ఉంటుందో, అప్పుడు మాయ తుఫానులు సమాప్తమవుతాయి.

గీతము:- నా మనసు అనే ద్వారములోకి ఎవరు వచ్చారు... (కౌన్ ఆయా మేరే మన్ కే ద్వారే...)

ఓంశాంతి. భగవానువాచ - ఆత్మలకు తండ్రి, వారిని పరమపిత పరమాత్మ అంటారని పిల్లలు అర్థం చేసుకున్నారు. తండ్రి స్వయంగా అర్థం చేయిస్తారు - నాకు ఆకారంలో పెద్ద రూపమేమీ లేదు. ఏ విధంగానైతే ఆత్మ నక్షత్రము అని, భృకుటి మధ్యలో ఉంటుందని అంటారో, అదే విధంగా పరమాత్మనైన నేను కూడా ఉంటాను. వారి మహిమ గొప్పది. వారు జ్ఞాన సాగరుడు. ఇకపోతే ఇంత పెద్ద చిత్రము వలె ఉండరు. ఇంత పెద్దగా ఉన్నట్లయితే ఈ శరీరంలోకి ప్రవేశించలేరు. వీరైతే శివలింగాన్ని పూజిస్తారు కావున పెద్దగా తయారుచేస్తారు. అంగుష్టం వలె ఉంటారని అంటారు. ఆత్మ అంటే ఆత్మనే, కేవలం వారిని పరమ (ఆత్మ) అని అంటారు, వారు పరంధామంలో ఉంటారు. ఈ సమయంలో ఆసురీ ప్రపంచము, ఆసురీ సాంప్రదాయం ఉందని మీకు తెలుసు. సత్యయుగంలో ఈ భారత్ లో దేవతల రాజ్యముండేది, ఇప్పుడైతే ఆసురీ రాజ్యముంది. చూడండి, ఏమేమి తింటూ ఉంటారు! మాంసము, మద్యము - ఇవి రాక్షస ఆహారము, ఈ విషయాన్ని కూడా అర్థం చేసుకోరు. స్కూల్లో కూడా కొందరి ఆలోచనలు మంచిగా, కొందరివి రజోగుణం కలవిగా, కొందరివి తమోగుణం కలవిగా ఉంటాయి. ఎవరైతే ఇతరులకు అర్థం చేయించలేరో, వారిని తెలివిహీనులని అంటారు. బ్రహ్మాకుమార-కుమారీలలో కూడా ఎంతోమంది మహారథులు, గుర్రపు స్వారీ వారు, పాదచారులు నంబరువారుగా ఉన్నారు, వారు మంచి రీతిలో అర్థం చేయించలేరు. జ్ఞానం పూర్తిగా లేని కారణంగా డిస్ సర్వీస్ చేస్తారు. ఎవరిలో ఎంత జ్ఞానముంటే, అంత అర్థం చేయిస్తారు. నంబరువారుగా అయితే ఉన్నారు కదా. అక్కడక్కడా పొరపాట్లు కూడా చేస్తారు. మేము దేవతలుగా అవుతున్నామని పిల్లలకు నషా ఉండాలి. తండ్రి స్వయంగా అంటారు - నేను పతితుల ప్రపంచములోకి వస్తాను. సత్యయుగములో ఇతడే నారాయణునిగా ఉండేవారు - ఇప్పుడు మళ్ళీ ఇతడి తనువులోకి వచ్చాను, ఇతడినే నరుని నుండి నారాయణునిగా తయారుచేస్తాను. నంబరు వన్ పూజ్యునిగా కూడా వీరే ఉండేవారు, ఇప్పుడు నంబరు వన్ పూజారిగా కూడా వీరు అయ్యారు. వీరిదే ఆల్ రౌండ్ పాత్ర ఉంది. ఇది నా నిశ్చితమైన తనువు. ఇది మారజాలదు. ఎప్పుడైనా వేరొకరికి అవకాశం ఇస్తానని కాదు. ఈ డ్రామా తయారై తయారుచేయబడి ఉంది. ఇందులో మార్పు ఏమీ జరగజాలదు. బాబా అంటారు - నేను పతితుల ప్రపంచంలోకి వస్తాను, కానీ ఎవరినైనా పతితులు అంటే డిస్టర్బ్ అవుతారు. కానీ, అందరూ అసురీ సాంప్రదాయం కలవారని భగవానువాచ ఉన్నప్పుడు ఒప్పుకోవాల్సి ఉంటుంది. భగవంతుడు అనగా నిరాకార భగవంతుడు, బ్రహ్మా గాని, విష్ణువు గాని, శంకరుడు గాని, కృష్ణుడు గాని... పరమాత్మనైన నేను కూడా మీలాగే ఉంటానని అంటారు. భగవానువాచ - నేను మీకు రాజయోగాన్ని నేర్పించేందుకు వచ్చాను. యోగానికి ఎంతటి మహిమ ఉంది. ఎన్నో యోగాశ్రమాలు తెరుచుకున్నాయి. అందులో హఠయోగము మొదలైనవి నేర్పిస్తారు. కానీ మీరు యోగబలంతో మొత్తం విశ్వాన్ని స్వర్గంగా తయారుచేస్తారు. విశ్వాన్ని పరివర్తన చేస్తారు. మొత్తం ప్రపంచమైతే యోగంలో ఉండదు, యోగానికి ఎంత మహిమ ఉంది, దాని ద్వారా ముఖ్యంగా భారత్ స్వర్గంగా అవుతుంది. కానీ దీనిని స్వర్గంగా ఎవరు తయారుచేసారు అన్నది ఎవరికీ తెలియదు. ఈ విధంగా స్వర్గాన్ని తయారుచేసేవారు ఎవరో తప్పకుండా ఉంటారు. తండ్రి అంటారు - నేనే వచ్చి దేవతలుగా తయారయ్యేటువంటి కర్మలను నేర్పిస్తాను. ఇదైతే చాలా సహజము. వారైతే ఎన్నో యజ్ఞాలు చేస్తారు. ఇక్కడ మీరు యజ్ఞాలు, హోమాలు ఏమైనా చేస్తారా? అగరబత్తి కూడా సుగంధం కోసం పెడతారు. ఇకపోతే ఇక్కడ కర్మ కాండలకు సంబంధించిన విషయమేమీ లేదు. కావున తండ్రి తమ పరిచయాన్ని ఇస్తారు - ఏ విధంగానైతే మీరు ఉన్నారో, అలాగే నేను ఆత్మను. కానీ నేను పునర్జన్మలు తీసుకోను, జన్మ తీసుకుంటాను కానీ మరణంలోకి రాను, నా జయంతిని జరుపుకుంటారు. చదివించడానికి నేను ఈ తనువులోకి వస్తూ-వెళ్తూ ఉంటాను, కావున దీనిని మృత్యువు అని అనరు. దేవతలుగా తయారుచేయడానికి నేను వస్తాను. ఇప్పుడు ఎవరైతే వచ్చి చదువుకుంటారో... ఎవరైతే కల్పక్రితం

చదువుకుని ఉంటారో, వారే చదువుకుంటారు. చాలాకాలం నుండి దూరమైన ఆ సికీలధే పిల్లలే, ఇతరులు ఏమైనా 84 జన్మలలోకి వస్తారా, మనమే పూర్తిగా 84 జన్మల చక్రాన్ని తిరుగుతాము. మనుష్యులైతే ఎన్నో జన్మల తీసుకోవడంతో విసుగు చెందుతారు, మాకు 84 జన్మల చక్రంలోకి రావాలని లేదు అని మీకు చెప్తారు. కానీ మనము ఎంత బలశాలులము, మనము ఇంకా సంతోషపడతాము. మేము ఈ 84 జన్మల చక్రాన్ని స్మృతి చేస్తూ-చేస్తూ చక్రవర్తి రాజుగా అవుతాము. వారి జెండాలో కూడా చక్రముంది, దానిని వారు రాట్నంగా తయారుచేసారు. దాని ముందు మీ కోట్ ఆఫ్ ఆర్మ్స్ (రాజముద్ర) సరైనది. పైన శివబాబా, కింద త్రిమూర్తి మరియు చక్రము పూర్తి ఏక్యురేట్ గా ఉంది. మీ ఈ శివుని జెండా పూర్తిగా సరైనది.

సన్యాసము రెండు రకాలుగా ఉంటాయని మీకు అర్థం చేయించడం జరిగింది. ఒకటేమో నివృత్తి మార్గం యొక్క సన్యాసము, వారు అడవులలోకి వెళ్లారు, అది అర్ధ సన్యాసము. మీది పూర్తి సన్యాసము. దేనికి సంబంధించింది? మొత్తం ఆసురీ ప్రపంచం యొక్క సన్యాసం చేస్తారు, నా పతి, నా కొడుకు, నా గురువు... ఆ నాది-నాది అన్న వాటన్నింటి నుండి బుద్ధి యోగాన్ని తొలగిస్తారు. నాకు ఒక్క శివబాబా తప్ప ఇంకెవరూ లేరు. ఎప్పటి వరకైతే ఈ అవస్థ ఏర్పడదో, అప్పటి వరకు తుఫానులు వస్తూ ఉంటాయి. ఊగిసలాడుతూ ఉంటారు. తండ్రి మొత్తం ఆసురీ ప్రపంచం యొక్క సన్యాసం చేయిస్తారు ఎందుకంటే ఇదంతా భస్మమవ్వనున్నది. అంతా భస్మమవ్వాలి అని వారేమీ అనరు. మీరు సంబంధీకుల మధ్యన ఉంటారు, కానీ వారిని చూస్తూ బుద్ధి అక్కడ (పైన) జోడించబడి ఉంటుంది. నాదంటూ ఏదీ లేదు. అటువంటప్పుడు కామం, క్రోధం దేనిపై కలుగుతుంది! ఈ యుక్తి చాలా బాగుంది, కానీ ఇది బుద్ధిలో కూర్చోవాలి. దీనిని రాజయోగము అని అంటారు. మీరు యోగం జోడిస్తారు, రాజ్యాధికారాన్ని తీసుకుంటారు. అది హఠయోగము. ఇవి గుహ్యమైన పాయింట్లు. యోగులైతే ప్రపంచంలో చాలామంది ఉన్నారు. కానీ బాబా అంటారు - ఒక్కరికి కూడా నాతో యోగము లేదు. నా బదులు నా నివాస స్థానమైన బ్రహ్మ తత్వముతో యోగముంది. ఏ విధంగానైతే భారతవాసులు తమ నివాస స్థానమైన హిందుస్థాన్ ను తమ ధర్మంగా భావించి కూర్చున్నారో, అదే విధంగా వారు కూడా స్వయాన్ని బ్రహ్మ తత్వం యొక్క పిల్లలుగా భావిస్తారు. పిల్లలు అంటే మళ్ళీ వారసత్వం కావాలి. తత్వంలో లీనమవుతాము అని వారు అంటారు. బాబాకైతే అనుభవముంది. చాలా మంది సన్యాసులతో, గురువులతో అనుభవం ఉంది. అర్జునునికి చాలా మంది గురువులు ఉన్నట్లు కూడా చూపిస్తారు. మీరంతా అర్జునులు. ఈ సమయంలో మొత్తం ప్రపంచంపై రావణుడి రాజ్యముంది, మొత్తం ప్రపంచమంతా లంక. ఒక్క సిలాన్ ద్వీపమే లంక కాదు. అది హద్దు లంక. కానీ మొత్తం ప్రపంచము అనంతమైన లంక. ఇప్పుడు మొత్తం ప్రపంచంపైన రావణుడి రాజ్యముంది. రాముని రాజ్యంలో ఇంతమంది మనుష్యులు లేరు. ఎప్పుడైతే రామరాజ్యం ఉంటుందో, అప్పుడు రావణ రాజ్యం ఉండదు. ఎక్కడికి వెళ్తుంది? కింద పాతాళంలోకి వెళ్ళిపోతుంది. మళ్ళీ రావణ రాజ్యం వచ్చినప్పుడు రామరాజ్యం కిందకు వెళ్ళిపోతుంది. ఇది డ్రామా కదా. ఎప్పుడైతే చక్రం తిరుగుతుందో, అప్పుడు సత్యయుగం పైకి వస్తుంది. ద్వాపర, కలియుగాలు కిందకు వెళ్తే సత్య-త్రేతాయుగాలు కింద నుండి పైకి వస్తాయి. ఇది చక్రానికి సంబంధించిన విషయము, వారు ఇలా రాసేసారు. అంతేకానీ సాగరంలోకి ఏమీ వెళ్ళదు, అలాగే సాగరం నుండి బయటకు రాదు.

ఇవి చాలా గుహ్యమైన, అర్థం చేసుకోవాల్సిన విషయాలని తండ్రి అర్థం చేయిస్తారు. ఇందులో పవిత్రత మొదటిది మరియు యోగం పక్కాగా ఉండాలి. దీనిని పూర్తి సన్యాసమని అంటారు. ఈ ప్రపంచం నుండి బుద్ధియోగం సమాప్తము. ఈ విషయాలు మీలో కూడా ఎవరో అర్థం చేసుకుంటారు. అందరూ అర్థం చేసుకుంటే జ్ఞాన గంగలు అయిపోతారు. చిన్న నదులుగా అవుతారు, కాలువలుగా అవుతారు. అచ్ఛా, నీటి గుంటగా అయి ఇంట్లో వినిపించినా సరే, కొంత అర్థం చేసుకున్నారని భావించడం జరుగుతుంది. కానీ ఇంట్లో కూడా చెప్పలేరు. తండ్రి అంటారు - ఎంతటి పేదవారైనా కానీ ఇంట్లో గీతా పాఠశాల తెరవవచ్చు. ఒక్క గది ఉన్నా, అందులోనే తింటూ, తాగుతూ, పడుకుంటున్నా, అచ్ఛా! పనులు పూర్తి చేసుకుని, శుభ్రం చేసి, అప్పుడు ఈ క్లాస్ చేయండి. మూడు అడుగుల నేలలో ఇంత పెద్ద హాస్పిటల్ ను తెరవవచ్చు. షావుకార్ల విషయాన్ని వదలండి. తండ్రి పేదల పెన్నిధి కదా. మాకు ఇక్కడే స్వర్గముందని షావుకార్లు అంటారు. అప్పుడు బాబా అంటారు - అచ్ఛా, మీరు మీ స్వర్గంలోనే సంతోషంగా ఉండండి. నేను మీకు ఎందుకు ఇవ్వాలి. దానం కూడా పేదవారికి ఇవ్వడం జరుగుతుంది. గొప్ప వ్యక్తులు ఇక్కడ నేలపై కూర్చోవడానికి సంకోచిస్తారు. కావున బాబా అంటారు - మీ మహళ్ళలో ఉండండి. నా వద్దకు మంచి రీతిలో చదువుకొనే పేదవారు రావాలి. ఒకవేళ ఇతరులకు వినిపించలేకపోతే చిన్న చెరువు కూడా కానట్లే. మీరైతే పెద్ద నదిగా అవ్వాలి. మమ్మా-బాబాను ఫాలో చేయాలి. కానీ ఇంట్లో కూడా వినిపించలేకపోతే చేతిలో నీటిలాగా కూడా లేనట్లే. జ్ఞాన గంగలు ఎదురుగా ఉంటే బాబాకైతే ఆనందం కలుగుతుంది. బాబా సమ్ముఖంలో వింటే చాలామంది సంతోషిస్తారు. కానీ ఇక్కడి నుండి లేచి, మెట్లు దిగగానే

నషా కూడా దిగిపోతూ ఉంటుంది. మళ్ళీ ఇంటికి చేరుకోగానే ఆ పరచింతనే మొదలవుతుంది. బాబా అయితే నడవడిక ద్వారా అర్థం చేసుకుంటారు. కలుసుకునేందుకు వస్తారు. నా పతి, నా పిల్లలు అని అంటారు. అరే, నీకు పతి ఎక్కడి నుండి వచ్చారు? రావడము స్వర్గంలోకి వెళ్ళేందుకు వస్తారు, అయినా కూడా నాది-నాది అన్నదానిలో చిక్కుకొని ఉన్నారు. అచ్ఛా, ఇంత డోజు సరిపోతుంది. ఎంతైతే అరిగించుకోగలరో అంతే ఇవ్వాలి. తండ్రి సారంలో తెలియపర్చారు. యోగము ద్వారా మీరు స్వర్గాన్ని స్థాపన చేస్తున్నారు. ఇకపోతే రాజ్యం కోసం జ్ఞానం కావాలి. రెండు సబ్జెక్టులు ఉన్నాయి. బాబా కూడా యోగంలో ఉండేందుకు పురుషార్థం చేస్తారు, అందుకే - మర్చిపోను, గుర్తుంచుకోను అని అంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ పాత ప్రపంచాన్ని పూర్తిగా సన్యసించాలి. పవిత్రత మరియు యోగము అనే సబ్జెక్టులలో ఫస్ట్ నంబరు తీసుకోవాలి.

2. జ్ఞానగంగగా అయి పతితులను పావనంగా తయారుచేసే సేవను చేయాలి. మమ్మా-బాబాను ఫాలో చేసి పెద్ద నదిగా అవ్వండి.

వరదానము:- బ్రాహ్మణ జీవితంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందే అలౌకికతా సంపన్న భవ

ఈ అలౌకిక బ్రాహ్మణ జీవితం యొక్క విశేషమైన స్లోగన్ - ''తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం''. ఖర్చు తక్కువగా ఉండాలి కానీ ప్రాప్తి గొప్పగా ఉండాలి అనగా రిజల్టు చాలా మంచిగా ఉండాలి. ఎప్పుడైతే మాటలలో, కర్మలలో ఖర్చు తక్కువగా ఉంటుందో, అప్పుడు అలౌకికతా సంపన్నమైన జీవితమని అంటారు. తక్కువ సమయంలో పని ఎక్కువగా జరగాలి, తక్కువ మాటలలో స్పష్టీకరణ ఎక్కువగా ఉండాలి, సంకల్పాలు తక్కువగా ఉండాలి కానీ శక్తిశాలిగా ఉండాలి - దీనిని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభమని అంటారు. ఎవరైతే అన్ని ఖజానాలను తక్కువగా ఖర్చు చేస్తారో వారి భండారా నిండుగా ఉంటుంది.

స్లోగన్:- తండ్రి మరియు సేవ పట్ల సత్యమైన ప్రేమ ఉన్నట్లయితే పరివారం యొక్క ప్రేమ స్వతహాగా లభిస్తుంది.

మాతేశ్వరి గారి అమూల్యమైన మహావాక్యాలు

ఇప్పుడు ఈ శిరోమణి గీతలో భగవానువాచ ఉంది - పిల్లలూ, ఎక్కడైతే విజయం ఉంటుందో అక్కడ నేను ఉంటాను. పర్వతాలలో ఏవైతే హిమాలయ పర్వతాలు ఉన్నాయో, అక్కడ నేను ఉన్నాను మరియు సర్పాలలో కాల నాగు నేను అని కూడా పరమాత్ముని మహావాక్యాలు ఉన్నాయి. అందుకే పర్వతాలలో ఉన్నతమైన పర్వతంగా కైలాస పర్వతాన్ని చూపిస్తారు మరియు సర్పాలలో కాల నాగును చూపిస్తారు, దీని ద్వారా ఏమి నిరూపించబడుతుందంటే - అన్ని సర్పాలలో కేవలం కాల నాగులో పరమాత్మ ఉన్నట్లయితే, అన్ని సర్పాలలో వారు ఉంటున్నట్లు కాదు కదా. ఒకవేళ పరమాత్మ ఉన్నతోన్నతమైన పర్వతాలలో ఉన్నారంటే కింద పర్వతాలలో లేరని అర్థము మరియు ఎక్కడైతే విజయం ఉంటుందో అక్కడ నా జన్మ ఉంటుందని అంటే ఓటమిలో నేను లేనట్లు. పరమాత్మ సర్వవ్యాపి కాదు అని దీని ద్వారా నిరూపించబడుతుంది. ఒకవైపు ఇలా కూడా అంటారు మరియు ఇంకొక వైపు పరమాత్మ అనేక రూపాలలో వస్తారని కూడా అంటారు, పరమాత్మను 24 అవతారాలలో చూపించారు, తాబేలు, చేప మొదలైనవన్ని పరమాత్మ రూపాలేనని అంటారు. ఇది వారి అసత్య జ్ఞానము, అలాగే పరమాత్మను సర్వత్రా ఉన్నారని భావిస్తారు కానీ ఈ సమయంలో కలియుగంలో సర్వత్రా మాయనే వ్యాపించి ఉంది, అటువంటప్పుడు పరమాత్మ ఎలా వ్యాపించి ఉన్నారు? నేను మాయలో వ్యాపించి లేను అని గీతలో కూడా అంటారు, పరమాత్మ సర్వత్రా లేరని దీని ద్వారా ఋజువవుతుంది.

2) మనము నిరాకారీ ప్రపంచము అని అన్నప్పుడు నిరాకారము అనగా అర్థము వారికి ఎటువంటి ఆకారము లేదని కాదు, మనం నిరాకారీ ప్రపంచము అని అంటే తప్పకుండా ఏదో ప్రపంచము ఉందని అర్థము, కానీ అది స్థూలమైన సృష్టి వంటి ఆకారం ఉండదు. అలాగే పరమాత్మ నిరాకారుడు కానీ వారికి తమ సూక్ష్మ స్వరూపం తప్పకుండా ఉంది. కావున

ఆత్మలమైన మన మరియు పరమాత్మ యొక్క ధామము నిరాకారీ ప్రపంచము. మనం ప్రపంచము అన్న పదం అన్నప్పుడు, అది ప్రపంచము మరియు అక్కడ ఉంటారు కావుననే దానికి ప్రపంచము అన్న పేరు వచ్చిందని దీని ద్వారా ఋజువవుతుంది. ప్రపంచంలోనివారు పరమాత్ముని రూపం కూడా అఖండ జ్యోతి తత్వమని భావిస్తారు, అదేమో పరమాత్మ నివసించే స్థానము, దానిని రిటైర్డ్ హోమ్ అని అంటారు. కావున మనం పరమాత్ముని ఇంటిని పరమాత్మ అని అనకూడదు. ఇంకొకటి ఆకారీ ప్రపంచము, అక్కడ దేవతలైన బ్రహ్మ, విష్ణు, శంకరులు ఆకారీ రూపంలో ఉంటారు మరియు ఇది సాకార ప్రపంచము, ఇందులో రెండు భాగాలు ఉన్నాయి - ఒకటేమో నిర్వికారీ స్వర్గ ప్రపంచము, అక్కడ అర్ధ కల్పం సర్వదా సుఖముంటుంది, పవిత్రత మరియు శాంతి ఉంటుంది. రెండవది వికారీ కలియుగీ దుఃఖమయమైన మరియు అశాంత ప్రపంచము. ఇప్పుడు వాటిని రెండు ప్రపంచాలు అని ఎందుకంటారు? ఎందుకంటే మనుష్యులు స్వర్గము మరియు నరకము రెండూ పరమాత్మ రచించిన ప్రపంచాలు అని అంటారు, దీని గురించి పరమాత్ముని మహావాక్యాలు ఉన్నాయి - పిల్లలూ, నేను దుఃఖమయ ప్రపంచాన్ని రచించలేదు, నేను ఏ ప్రపంచాన్ని అయితే రచించానో, సుఖమయ ప్రపంచాన్నే రచించాను. ఇప్పుడు ఈ దుఃఖమయమైన మరియు అశాంతమయమైన ప్రపంచమేదైతే ఉందో, అది మనుష్య ఆత్మలు తమను తాము మరియు పరమాత్మనైన నన్ను మరిచిపోయిన కారణంగా ఈ లెక్కాచారాలను అనుభవిస్తున్నారు. అంతేకానీ ఏ సమయంలోనైతే సుఖమయమైన మరియు పుణ్య ప్రపంచము ఉంటుందో, అక్కడ సృష్టి నడవదు అనేమీ కాదు. అవును, తప్పకుండా అక్కడ దేవతల నివాస స్థానము ఉండేది అని మనం అంటున్నప్పుడు, అక్కడ అన్ని ప్రవృత్తులు జరిగేవి, కానీ ఇదైతే ఖచ్చితము - అక్కడ వికారాలతో జన్మ జరిగేది కాదు, దాని కారణంగానే ఇన్ని కర్మబంధనాలు ఉండేవి కావు. ఆ ప్రపంచాన్ని కర్మబంధన రహితమైన స్వర్గ ప్రపంచము అని అంటారు. కావున ఒకటేమో నిరాకారీ ప్రపంచము, రెండవది ఆకారీ ప్రపంచము, మూడవది సాకారీ ప్రపంచము. అచ్చా - ఓం శాంతి.